

సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి


## ప్రతి పౌరుడు శాంతియుతంగా బతకాలి

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బీబీనగర్, జూన్ 8 : ప్రపంచంలో ప్రతి పౌరుడూ శాంతియుతంగా బతకాలని, శాంతి సమైక్యత విశ్వసనీయత ఈ మూడు భావాలు కలిగి ఉండాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహదేవ్‌పూర్‌లోని బ్రహ్మ కుమారీస్ రిట్రీట్ సెంటర్‌లో నిర్వహించిన సామాజిక శాంతి, ఐక్యతను పెంపొందించడంలో మీడియా పాత్ర అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మీడియా టెక్నాలజీ వచ్చిన తర్వాత వాస్తవం వేరు సత్యం వేరుగా మారిపోయిందని టెక్నాలజీలో వచ్చిన మార్పులు చూస్తున్నామన్నారు. సోషల్ మీడియా బాధ్యతాయుతంగా లేదని ఏది నిజం ఏది అబద్ధం అనేది తెలుసుకునే పరిస్థితి లేదన్నారు. వాస్తవాన్ని గుర్తించి ప్రజలకు తెలియజేయాలన్నారు. విశిష్ట అతిథులు వై బాబ్జి, ఎల్ వేణుగోపాల్ నాయుడు, ఉప్పాల లక్ష్మణ్, ప్రియంకా కౌశల్, పీఆర్‌వో, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ వైస్ చాన్స్‌లర్ కాకతీయ యూనివర్సిటీ విద్యావతి,యోగిని, సరళ బెన్, కోటిరెడ్డి, పాల్గొన్నారు.

## మదర్ డెయిరీ చైర్మన్‌గా గాల్‌రెడ్డి

రాజాపేట, జూన్ 8 : చల్లూరు అన్నదాత మదర్ డెయిరీ చైర్మన్‌గా ఆదివారం అరుకాల గాల్‌రెడ్డి 26వ సారి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మీస బాలమల్లయ్య తెలిపారు. అదేవిధంగా డైరెక్టర్లుగా గాల్‌రెడ్డి, వర్కల అజయ్ కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు యాదగిరిరెడ్డి, రాజిరెడ్డి, కృ ష్ణ, రాములు, లక్ష్మి, కిష్టయ్య, తిరుపతి, మల్లేశం, పాల ఉత్పత్తి దారులు, సొసైటీ వేతన కార్యదర్శి బీమగాని మధు పాల్గొన్నారు.




భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# ప్రభుత్వ దవాఖానలో ఒక్కరే డాక్టర్

- **రోగులకు అరకొర వైద్య సేవలు**

భూదాన్‌పోచంపల్లి, జూన్ 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉన్నా.. ఒక్క డాక్టరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు పూర్తిగా వైద్య సేవలు అందడం లేదు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు నిరాశతో వెను తిరిగి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గతంలో కరోనాకు ముందు డాక్టర్ సత్య ప్రకాష్‌తో ఇద్దరు వైద్యులు సేవలందించేవారు. డాక్టర్ బదిలీ కావడంతో నాటి నుంచి నేటి వరకు ఒక్క డాక్టర్ మాత్రమే సేవలందిస్తున్నారు. మండలంలో జిబ్లక్‌పల్లి, పిలాయపల్లిలో సీనియర్ ఏఎన్‌ఎంలు నియమించాల్సి ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలో మొత్తం 51 వేల జనాభా, మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన ముక్తాపూర్, రేవనపల్లి, గ్రామాలను కలుపుకొని 17,010 జనాభా, 21 గ్రామపంచాయతీలో 33,987 జనాభా ఉంది. పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 100కు పైగా ఓపీ రోగులు వస్తున్నారు. పోచంపల్లి పట్టణం హైదరాబాద్‌కు దగ్గర ఉండటం పట్టణం అభివృద్ధి చెందడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే సరైన వైద్య సేవలందడంలేదు. దీంతో వారు హైదరాబాద్, చౌటుప్పల్, భువనగిరికి వెళ్లాల్సి వస్తున్నది. పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో బిల్లులు చెల్లించలేక అప్పుల బారిన పడుతున్నారు.

## అదనపు డాక్టర్‌ను నియమించాలి

### కిరణ్, బీఆర్‌ఎస్ నాయకుడు, భూదాన్‌పోచంపల్లి



24 గంటల ప్రభుత్వాసుపత్రిలో ఒక డాక్టర్ పని చేస్తున్నారు. ప్రభుత్వం మరో డాక్టర్ పోస్టును మంజూరు చేసి నియమించాలి. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలందక హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని అదనపు డాక్టర్‌ను నియమించాలి.

## ప్రజలు ఆందోళన చెందొద్దు

### కలెక్టర్ హనుమంతరావు



భువనగిరికలెక్టరేట్, జూన్8: ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే మూడు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఈ నెల 30 వ తేదీ వరకు ఒకే సారి పంపిణీ చేయడం జరుగుతుందని,లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు లబ్ధిదారులు ఒకేసారి పొందవచ్చని అన్నారు. రేషన్ కార్డులు కలిగిన వారు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

భువనగిరికలెక్టరేట్, జూన్ 8 : ఆచార్యా ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను త్రైత సిద్ధాంగ ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నందనంలో ప్రచారం నిర్వహించారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ అతి సులువుగా అన్ని వర్గాల వారికి అర్థమయ్యేరీతిలో త్రైత సిద్ధాంతం భగవద్గీతను రూపొందించారని ప్రతి ఒక్కరూ ఈ భగవద్గీతను చదివి ముక్తి పొందాలన్నారు. ఈకార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి, చేర్యాల, తొర్రూరు, హుజూరాబాద్, మహబూబాబాద్ కమిటీ సభ్యులు దేవేంద్ర, శంకర్, రాము, లింగస్వామి, భాస్కర్, బుచ్చిబాబు, రామకృష్ణ, అశోక్, నితిన్, కవిత, లలిత, మంజుల, మాధవి, లావణ్య, శ్రీరామ్, సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు తప్పా.. అమలులో ప్రభుత్వం విఫలం

### బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం),జూన్ 8 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుర్కపల్లి మండలంలో నిర్వహించిన సీఎం బహిరంగ సభ ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లే ఉందని.. బహిరంగ సభలో మాట్లాడిన మాటలన్నీ అబద్ధపు మాటలేనన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడిపోయాయన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, పంజాల వెంకటేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి యాస రంగారెడ్డి, సత్యనారాయణ, ఏలేందర్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### 'బడిబాట' కార్యక్రమంలో ఎంఈఓలు

కొండమల్లేపల్లి, జూన్ 8 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో నాగేశ్వర్‌రావు కోరారు. ఆదివారం మండలంలోని గుడితండా, ఇస్లావత్‌తండాలో డోర్ టు డోర్ వెళ్లి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ట్రైనీ ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధనతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, నోటుపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, జాన్‌నాయక్, సైదులు, గణేశ్, గీతాంజలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దామరచర్ల, జూన్ 6: మండలంలో నేటి నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో అలివేలు మంగమ్మ ఆదేశించారు. అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 6 నుండి19 వరకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో ఆరు నుండి 14ఏండ్లలోపు బాలబాలికలు అందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చూడాలన్నారు. గ్రామకార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని, గ్రామ పెద్దలతో కార్యాచరణ చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ఏపీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చందంపేట, జూన్ 8 : చందంపేట మండల కేంద్రంలో ఆదివారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో చందర్ నాయక్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. చందర్, శేఖర్, కొండయ్య, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఆత్మకూరు (ఎం), జూన్ 8: పల్లెపహాడ్, తుక్కాపురం గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పులహరిదీప్ రెడ్డి సహకారంతో అందజేసిన రూ. 10వేలను ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కో కుటుంబానికి రూ. 5వేల చొప్పున అందజేసి సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాలే మల్లేశ్, నాయకులు పర్శరాములు, నర్సయ్య, రవి, బుచ్చిరెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా చేపల విక్రయాలు



**భూదాన్‌పోచంపల్లి, జూన్ 8 : మండలంలో మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం చేపల విక్రయాలతో సందడి నెలకొన్నది. ప్రజలు చేపలు, చికెన్, మటన్ మాంసం కోసం ఉదయం నుంచి క్యూ కట్టారు. సాధారణ చేపలు రూ.150, నుంచి కొర్రమీను రూ.450 వరకు విక్రయించారు.**

## రాజకోటలో సినిమా డైరెక్టర్ అశోక్ తేజ


రాజాపేట కోటను పరిశీలిస్తున్న ఓదెల సినిమా డైరెక్టర్ అశోక్ తేజ

రాజాపేట, జూన్ 8: మండల కేంద్రంలోని పురాతన అద్భుతమైన రాజకోటను ఆదివారం ప్రముఖ సినిమా డైరెక్టర్ అశోక్ తేజ సందర్శించారు. ఈ సందర్భంగా రాజకోటలోని రాజులు పరిపాలించిన సందర్భంగా నిర్మించిన అంతఃపురాన్ని కారాగారాలను, కోనేరు సైనిక ప్రాంగణాన్ని ఎత్తైన రాతి బురుజులను పరిశీలించి రాజకోట చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటివరకు కన్నడ, తెలుగులో నాలుగు సినిమాలు నిర్మించానని అందులో రెండు తెలుగు సినిమాలు ఓదెల రైల్వే స్టేషన్, ఓదెల 2 సినిమాలు చేశానని ఓదెల రైల్వే స్టేషన్‌లో హెబ్బా పటేల్ నటించగా, ఓదెల 2 లో తమన్నా హీరోయిన్‌గా నటించినట్లు తెలిపారు. కొద్ది రోజుల్లో భారీ బడ్జెట్ తో సినిమా చేస్తున్నానని అందులో హీరోకు సూపర్ పవర్స్ ఉండటం, కిల్లర్ కమర్షియల్ వంటివి ప్రత్యేకంగా ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ప్రముఖ వ్యాపారవేత్త పుల్లూరు వెంకటేశం తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు సన్మానం

చిట్యాల, జూన్ 8: ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధించిన పాండవ ముదిరాజ్ విద్యార్థులను తమ(మత్స్య కార్మిక) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి నగదు పురస్కారాన్ని అందజేశారు. ఎస్ఎస్‌సీలో పద్మోళ్ల రిత్విక్, ఆవుల జితేందర్, నిమ్మల స్నిగ్ధ, ఇంటర్‌లో గొడుగు లక్ష్మీభవాని, జోగు యశ్వంత్, సుందర్ మేఘవర్షిణిలను సన్మానించి, ఒక్కొక్కరికీ రూ. 1116లను నగదు పురస్కారంగా అందజేశారు. గత ఆరేండ్ల నుంచి ముదిరాజ్ విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు సన్మానిస్తున్నట్లు అధ్యక్షుడు గొడుగు యాదగిరి తెలిపాడు.

## కరాటేతో మనోధైర్యం

### దక్షిణ భారత జేకేఎస్ చీఫ్ సుదర్శన్

రామగిరి, జూన్ 8 : కరాటేతో మనోధైర్యం పెరుగుతుందని కరాటే దక్షిణ భారత జేకేఎస్ చీఫ్ రాపోలు సుదర్శన్, ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం ఎంవీఎన్‌లో విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానోత్సవంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ దక్షిణ భాతర రాష్ట్రాల చీఫ్ ఎగ్జామినర్ సుదర్శన్ మాస్టర్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల సైదులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూళ్లు ఏర్పాటుచేయాలి

- **వేనేపల్లి పాండురంగారావు డిమాండ్**

మిర్యాలగూడ, జూన్ 8 : 60 ఏండ్ల సుదీర్ఘ పోరాటం, అనేక మంది అమరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణలో సైనిక్ స్కూల్ లేదని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా ప్లకార్డులతో నిరసన తెలిపి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న కోరుకొండ సైనిక్ స్కూల్ కాకుండా మరో మూడు కేటాయించారని, కానీ, తెలంగాణకు ఒక్కటీ కేటాయించలేదని పేర్కొన్నారు. కేంద్రం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో కొత్త స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నందున తెలంగాణలోనూ స్కూళ్లు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు సహకరించాలని, కోరుకొండలో మన విద్యార్థులను స్థానికులుగా గుర్తించేలా అనుమతివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## కారు ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ, జూన్ 8: ప్రమాదవశాత్తు కారు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని షాబూనగర్ కాలనీకి చెందిన పొట్లూరి అలివేలు(35) తన తల్లి బొజ్జ యశోదతో కలిసి గుంటూరుకు శనివారం ఉదయం వెళ్లి తిరిగి సాయంత్రం 6గంటలకు గుంటూరు నుంచి మిర్యాలగూడకు లారీలో వస్తున్నారు. రాత్రి 10గంటల సమయంలో మార్గమధ్యంలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులోకి రాగానే లారీ డ్రైవర్ లారీని ఆపాడు. అలివేలు, యశోదలు బహిర్భూమికని లారీ దిగి వెళ్లి లారీ వద్దకు వస్తుండగా అదే సమయంలో గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు అతివేగంతో వస్తున్న కారు రోడ్డు దాటుతున్న అలివేలును ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అలివేలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈమేరకు అలివేలు తల్లి బొజ్జ యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

కొండమల్లేపల్లి, జూన్ 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.7,500 చొప్పున వానకాలం రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేసి, రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసా ఎకరానికి రూ.7,500 ఇస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.6వేలకు కుదించినప్పటికీ 2024 ఏడాది వానకాలం రైతులకు రైతు భరోసా వర్తింపజేయలేదన్నారు. యాసంగి రైతు భరోసా వేశామని గొప్ప లు చెబుతున్న సీఎం, మంత్రులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో రైతుభరోసా ఇవ్వలేదన్నారు. తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేసి, ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు లింగారెడ్డి, సత్యనారాయణ, పాండు, రమావత్ దీప్లానాయక్, శ్రీను, శేఖర్‌యాదవ్, దాచేపల్లి నరేందర్, తోటపల్లి వెంకటేశ్వర్లు, అందుగల వెంకటేష్ పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన ఝాన్సీకి సన్మానం

చందంపేట(దేవరకొండ), జూన్ 8 : ఎలక్ట్రికల్ ఇంజినీర్ విభాగంలో 'లిథియం అయాన్' అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీశ్ ఆధ్వర్యంలో పరిశోధనకుగానూ గడ్డం ఝాన్సీ డాక్టరేట్ అందుకోవడంపై దేవరకొండ గ్రంథాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ వీసీ రామచంద్రం, పొనుగూరి లింగయ్య, పగిడిమర్రి సత్యమూర్తి, రంజాన్‌బేగ్, పున్న వెంకటేశ్వర్లు, బాషా, చంద్రమౌళి, ఖాదర్‌బాబా, శ్రీనివాస్, భిక్షమయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలి

### ఎంపీడీవో శ్రీనివాసరావు


ఇంటి నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎంపీడీఓ సీహెచ్, శ్రీనివాసరావు


భువనగిరికలెక్టరేట్, జూన్ 8 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్, శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం అందించే రుణాన్ని సద్వినియోగం చేసుకుని పేదలు సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గన్నారు.

### పిలాయిపల్లిలో..


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజలో చేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 8 : పిలాయిపల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఆదివారం ముగ్గులు పోసి భూమి పూజ చేశారు. గ్రామంలో 45 మందికి గాను 20 ఇండ్ల నిర్మాణం ప్రారంభించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కంచర్ల రాజశేఖర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, నాయకులు తోట శ్రీనివాస్, భూషణం, పడాల సతీష్‌చారి, అందెల ఆనంద్, తోట బాబు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆలేరురూరల్, జూన్ 8: మండలంలోని కొలనుపాకలో 2000–2001 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. నాటి మధుర స్మృతులు జ్ఞాపకం చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, వీరారెడ్డి, సుజాత, విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పార్వతి విజయ, తుపాకుల భాగ్యలక్ష్మి, దూడల సోములు, బీమగాని వెంకటేశ్, మిట్టపల్లి పాండు, అమృతం బాలరాజు, బాదిని రామకృష్ణ, జంగ సురేశ్, నోముల ప్రభాకర్ తదితరులున్నారు.

### చల్లూరులో ...

రాజాపేట, జూన్ 8 : చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000– 01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లోని తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.